చదువు
10
■ e-mail: edc@eenadu.in
హైదరాబాద్
ఈనాడు
గురువారం నవంబరు 23, 2023

బ్యాక్‌లాగ్ పేపర్లు రాయొచ్చా?

దూరవిద్యా విధానంలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సులో (2007) నాగార్జున యూనివర్సిటీలో చేరాను. కొన్ని థియరీ బ్యాక్‌లాగ్ పేపర్లు మిగిలాయి. పూర్వ విద్యార్థిగా నిర్దేశిత ఫీజు చెల్లించి వాటిని పూర్తిచేయొచ్చా? – సీహెచ్.రాజశేఖర్

■ సాధారణంగా ఏదైనా యూనివర్సిటీలో ఒక కోర్సులో చేరినప్పుడు ఆ కోర్సు పూర్తిచేయడానికి కనిష్ఠ, గరిష్ఠ కాల పరిమితులు ఆ సంస్థ నియమ నిబంధనల ప్రకారం నిర్దేశించివుంటాయి. ఉదాహరణకు ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకాం లాంటి పీజీ కోర్సులను కనిష్ఠంగా రెండు సంవత్సరాల కాల వ్యవధిలో పూర్తి చేయాలి. ఇక గరిష్ఠ వ్యవధి విషయానికొస్తే- ఒక్కో యూనివర్సిటీ ఒక్కో కాల పరిమితిని నిర్ణయిస్తోంది. చాలా యూనివర్సిటీలు పీజీ కోర్సుకు గరిష్ఠ పరిమితిని నాలుగు సంవత్సరాలుగా, కొన్ని యూనివర్సిటీలు మాత్రం ఐదు సంవత్సరాలుగా నిర్ణయించాయి.

మీ విషయానికొస్తే- ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యలో రెండు సంవత్సరాల పీజీ కోర్సును గరిష్ఠంగా ఐదు సంవత్సరాల్లో పూర్తిచేయాలి. మీరు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ 2007లో చేరారు కాబట్టి, 2012లోగా కోర్సును పూర్తి చేసి ఉండవలసింది. చాలా యూనివర్సిటీలు కోర్సులో చేరిన సంవత్సరంతో సంబంధం లేకుండా మానవతా దృక్పథంతో బ్యాక్‌లాగ్ పేపర్లను రాయడానికి అప్పుడప్పుడూ ఒకే ఒక్క అవకాశాన్ని ఇస్తూ ఉంటాయి. ఆ అవకాశం కోసం వేచి చూడండి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం విద్యార్థి వ్యక్తిగత దరఖాస్తును ఆధారం చేసుకొని, సహేతుకమైన కారణాలుంటే ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలు రాసే అవకాశాన్ని కూడా కల్పిస్తారు. మీరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం సంచాలకులను సంప్రదించి మీ సందేహాలను నివృత్తి చేసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఏఐకి దీటుగా.. నిలబడదామా?

1 మనం పనిచేసే తీరును ఏఐ మార్చేస్తోంది. ఇప్పుడున్న చాలా ఉద్యోగాలు ఆటోమేట్ అయిపోతాయనే విషయం ఇప్పటికే తెలుసు. ఈ నేపథ్యంలో కెరియర్‌ను మొదలుపెట్టే ప్రతి అభ్యర్థి ఇందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ డిజిటల్ రివల్యూషన్‌లో మనం స్థిరంగా ఉద్యోగంలో ఉండాలంటే కేవలం కంప్యూటర్లు చేయగలిగే పనులే కాకుండా.. అంతకుమించి నేర్చుకుని సిద్ధంగా ఉండాలి!

2 ▲ ఉత్పాదకత, సామర్థ్యం, వేగం, కచ్చితత్వం.. వీటిలో ఏఐ మనుషులకంటే ఓ అడుగు ముందే ఉంటుంది. వారు చేసే పనులను ఇంకా సులభంగా చేసేయగలుగుతుంది. ఇప్పటికే డేటాను విశ్లేషించి జవాబులు, ఇన్‌సైట్స్ ఇచ్చే ఉద్యోగాలను చాలా సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఏఐ ఆక్రమించింది. గతంలో వీటికి ప్రత్యేకంగా ఉద్యోగులు ఉండేవారు. ప్రింటింగ్, విద్యుత్తు, విమానాలు, ఇంటర్నెట్.. ఇవన్నీ కనిపెట్టే ముందున్న సమాజం వాటి ఆవిర్భావం తర్వాత చాలా మారిపోయింది. ప్రస్తుతం మనం కూడా అటువంటి సంధి దశలో ఉన్నామని చెప్పవచ్చు.

3 ▲ ఏఐ వల్ల చాలా ఉద్యోగాలు లేకుండా పోవడం నిజమే అయినప్పటికీ కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయనేది కూడా వాస్తవం. వాటిని అందిపుచ్చుకునేలా ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటూ ఉండటం అవసరం. అప్‌స్కిలింగ్ అనేది ఈ పోటీలో నిలబెట్టే ప్రధాన ఆయుధం. నిపుణులైతే మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్, ఇతర అత్యాధునిక టెక్నాలజీపై దృష్టి పెట్టాలని చెబుతున్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. గత కొంతకాలంగా మనుషుల జీవితాలను ఎంతగానో ప్రభావితం చేసింది. రాబోయే కాలంలో మరింతగా మన ఉద్యోగాల తీరును ప్రభావితం చేయబోతోంది. ఇప్పటికే ఉన్న కొలువుల్లో కొన్ని ఉంటాయో ఉండవో చెప్పలేని పరిస్థితి. అలాగే కొత్తగా సృష్టించే ఉద్యోగాలకు మనం సిద్ధంగా ఉండటం కూడా చాలా ముఖ్యం. దీనికి అవసరమయ్యే నైపుణ్యాలేంటో, ఇంకా ఈ విషయమై మరింత విపులంగా పరిశీలిద్దామా!



ఏ ఉద్యోగాలు భద్రం?

నిజానికి ఇప్పుడున్న దానికంటే వచ్చే ఐదేళ్లలో ఏఐ మరింత ఎదగనుందని నిపుణుల అంచనా. దీనివల్ల దాదాపుగా అన్ని కెరియర్లూ ఎంతో కొంత ప్రభావానికి గురవుతాయి. ఏ ఒక్కటీ అస్సలు ప్రభావితం కాకుండా ఉంటుందని చెప్పలేం. అయితే కొన్ని ఉద్యోగాలు మిగతావాటితో పోలిస్తే కొంత భద్రంగా ఉంటాయి. సులభంగా ఆటోమేట్ చేయడానికి వీలు లేని ఉద్యోగాల్లో ఉన్నవారికి కొంత వరకూ పర్వాలేదు. ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ కలిగి ఉండాల్సిన ఉద్యోగాలకు అధిక భద్రత ఉంటుంది.

▲ ఇప్పుడు మనుషులు చేస్తున్న ఉద్యోగాల్లో దాదాపు నాలుగో వంతు రేపు ఏఐ చేసేయవచ్చని అంచనా. లాజిస్టిక్స్ - సప్లై చెయిన్, వ్యవసాయ సంబంధిత కెరియర్లు, లా, రక్షణ రంగం, వైద్యం వంటి వాటిలో కొన్ని విభాగాలు మాత్రం అంత తేలికగా ప్రభావానికి గురికావనేది ఒక వాదన. అంతేకాదు.. నైపుణ్యాలకు మెరుగు పెడితే పోటీలో మరింత ముందంజలో ఉండొచ్చు.

సృజనాత్మకత

అత్యంత తెలివైన కంప్యూటర్ కూడా మైమరపించే చిత్రాలను గీయలేకపోవచ్చు, వీనులవిందైన సంగీతాన్ని సృష్టించలేకపోవచ్చు! కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మనుషుల్లా కొత్త ఆలోచనలు సృష్టించలేదు, తన పరిధి మేరకే ప్రవర్తిస్తుంది. ఊహకు అందని సృజనాత్మకతతో కొత్త అడుగులు వేయడం కేవలం మనుషులకే సాధ్యం. ఇది విద్య, వినోద, వ్యాపార రంగాల్లో ఎక్కడైనా ఏ రూపంలోనైనా అభ్యర్థులను ప్రత్యేకంగా నిలబెట్టగలదు. అందుకే సృజనాత్మకతతో కూడిన రంగాలను ఏఐ ఏమీ చేయలేకపోవచ్చు. సృజనలో ఊహాశక్తి, సందర్భానికి తగిన విధంగా స్పందించడం, పరిస్థితిని చూసి స్ఫూర్తి పొందడం భాగం.. ఇవన్నీ మనుషులు చేసినట్టుగా సాఫ్ట్‌వేర్లు చేయలేవు.

▲ ఇటువంటి స్కిల్స్ అవసరమైన ప్రతి చోటా అభ్యర్థుల అవసరం కచ్చితంగా ఉంటుంది. దీన్ని అలవరుచుకోవడం, ప్రతిదీ కొత్తగా ఆలోచించడానికి, చేయడానికి ప్రయత్నించడం ద్వారా ఏఐతో పోటీలో నెగ్గుకురావొచ్చు.

నిర్ణయాత్మకశక్తి

ఒక రోబోను ఏదైనా క్లిష్ట పరిస్థితిలో ఉంచి, నిర్ణయం తీసుకోమంటే అది ఏం చేయగలుగుతుంది? ఎటువంటి కెరియర్ అయినా సరే నిర్ణయాలు తీసుకునే శక్తి అవసరమయ్యే పోస్టుల్లో మనుషులే ఉండగలరు. సమస్యలను పరిష్కరించడం, సంప్రదింపులు చేసే నేర్పు తదితర నైపుణ్యాలు ఇలాంటి చోట్ల అవసరం అవుతాయి. 'సిచ్యువేషన్ జడ్జిమెంట్, డెసిషన్ మేకింగ్' అభ్యర్థులకు ఉండాల్సిన స్కిల్స్‌లో ముఖ్యమైనవి.

ఎమోషనల్ ఇంటెలిజెన్స్

ఏఐ తెలివైనదే.. కానీ ఎమోషనల్ ఇంటెలిజెన్స్ (ఈఐ) దానికి సులభం కాదు, కేవలం మనుషులకే సాధ్యం. ఎదుటివారి ఆలోచనలను, భావోద్వేగాలను, మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవడం.. అందుకు తగిన విధంగా ప్రవర్తించడం.. అవసరాన్ని బట్టి ఆదరణ, అభిమానం చూపడం.. ఇవన్నీ దానికి రావు. నిజానికి స్థాయీ భేదం లేకుండా ఏ ఉద్యోగాలకైనా ఇది ఎంతో కొంత అవసరం అవుతూనే ఉంటుంది. ముఖ్యంగా బృందాల్లో పనిచేసినప్పుడు, లేదా వాటిని నడిపిస్తున్నప్పుడు ఈఐ తప్పక ఉండాలి. అందుకే దీన్ని పెంచుకునేందుకు అభ్యర్థులు దృష్టి పెట్టాలి.

▲ వీటితోపాటు డిజిటల్ లిటరసీ, డేటా లిటరసీ, డిజిటల్ ఫ్రెట్ అవేర్‌నెస్, క్రిటికల్ థింకింగ్.. వంటి నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలి.

ఒకప్పుడు టెలిఫోన్‌లకు ప్రత్యేకంగా ఆపరేటర్లు ఉండేవారు, ఒకరి నుంచి మరొకరికి కాల్ వెళ్లాలంటే మధ్యలో వీరే వారధి.. ఇప్పటి తరానికి సినిమాల్లో చూడటం తప్ప ఆ విధానమే తెలియదు! టెక్నాలజీ పెరుగుదలతో కోల్పోయే ఉద్యోగాల గురించి చెప్పాలంటే ఇది మంచి ఉదాహరణ, ముఖ్యంగా ఇటువంటి మార్పుల వేగం కమ్యూనికేషన్ రంగంలో మరింత అధికం.

వేటిపై అధిక ప్రభావం?

అడ్మినిస్ట్రేటివ్, కోడింగ్, కస్టమర్ సర్వీస్, లీగల్‌లో కొన్ని విభాగాలు, టీచింగ్, ఫైనాన్స్, గ్రాఫిక్ డిజైనర్స్, ఇంజినీరింగ్, హ్యూమన్ రిసోర్స్ వంటి విభాగాల ఉద్యోగాలు అధికంగా ఆటోమేట్ అయ్యే అవకాశం ఉంటుందని మార్కెట్ నిపుణుల అంచనా. కేవలం టెక్నికల్ స్కిల్స్ కలిగి ఉండటం కాకుండా ఉద్యోగం ఎటువంటిదైనా మల్టీస్కిల్డ్‌గా ఉండేందుకు ప్రయత్నించడం ద్వారా కెరియర్లలో స్థిరంగా ఉండొచ్చు.

ప్రణాళికాసామర్థ్యం

ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ప్రణాళిక రచించడం వేరు.. అప్పటికప్పుడు మారిపోయే సందర్భాలకు తగిన విధంగా ప్రణాళికాబద్ధంగా నడుచుకోవడం, బృందాన్ని నడిపించడం కేవలం మనుషులకే సాధ్యమవుతుంది. ప్రణాళిక, వ్యూహాత్మక సామర్థ్యాలు మనుషుల నుంచి ఏఐకు గట్టి పోటీని ఇవ్వగలవు. పరిస్థితులను అంచనా వేయడం, రాబోయే సమస్యలను ముందుగానే పసిగట్టడం, నిరంతరం అప్రమత్తంగా ఉండటం.. ఇవన్నీ సంస్థలు అభ్యర్థుల నుంచి కోరుకునే నైపుణ్యాలు మాత్రమే కాదు, ఏఐ భర్తీ చేయలేని ముఖ్యమైన స్కిల్స్ కూడా. వీటిపై దృష్టి సారించిన అభ్యర్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నష్టపోయే అవకాశాలు తక్కువ.

నోటిఫికేషన్స్

ఎన్ఐఐహెచ్‌లో పర్సనల్ అసిస్టెంట్ ఖాళీలు

ప్రభుత్వ ఉద్యోగాలు

ముంబయిలోని ఐసీఎంఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునోహెమటాలజీ (ఎన్ఐఐహెచ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. పర్సనల్ అసిస్టెంట్: 01 పోస్టు **2. లోయర్ డివిజన్ క్లర్క్:** 01 పోస్టు
అర్హత: ఇంటర్, డిగ్రీ, షార్ట్ హ్యాండ్, టైపింగ్ స్కిల్.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఉంటుంది.
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.
దరఖాస్తు ఫీజు: రూ.300 ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు మినహాయించారు.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 27-11-2023.
రాత పరీక్ష తేదీ: 10.12.2023. **స్కిల్ టెస్ట్ తేదీ:** 17.12.2023.
వెబ్‌సైట్: https://niih.org.in/

మహాత్మాగాంధీ వర్సిటీలో..

బిహార్ రాష్ట్రం మోతిహరిలోని మహాత్మాగాంధీ సెంట్రల్ యూనివర్సిటీ (ఎంజీసీయూ), కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ విభాగం... టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రొఫెసర్: 02 పోస్టులు **2. అసిస్టెంట్ ప్రొఫెసర్:** 03 పోస్టులు
విభాగాలు: కామర్స్, మేనేజ్‌మెంట్, సైన్స్.
అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ, నెట్/ స్లెట్/ సెట్ ఉత్తీర్ణతతో పాటు బోధన/ పరిశోధనానుభవం ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.2,000. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగులకు మినహాయించారు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 02-12-2023.
వెబ్‌సైట్: https://mgcub.ac.in/

ఓయూలో ఉచిత సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ కోచింగ్

ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన సివిల్ సర్వీసెస్ అకాడమీ- యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్)కు సంబంధించి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది. ఉస్మానియా వర్సిటీ పరిధిలో పీజీ, పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉచిత యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) కోచింగ్
అర్హత: ఓయూ పీహెచ్‌డీ విద్యార్థులు, క్యాంపస్ కాలేజీలతో పాటు సికింద్రాబాద్, సైఫాబాద్ పీజీ కళాశాలలు, నిజాం కళాశాలకు చెందిన పీజీ విద్యార్థులు అర్హులు. **సీట్ల సంఖ్య:** 100.
ఎంపిక: డిగ్రీ మార్కులు, పీజీ ఎంట్రన్స్‌లో సాధించిన ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి. **శిక్షణ వ్యవధి:** నాలుగున్నర నెలలు.
దరఖాస్తు: ఓయూ వెబ్‌సైట్‌లో దరఖాస్తును పూర్తిచేసి, ధ్రువపత్రాల నకళ్లను ఓయూ సివిల్ సర్వీసెస్ అకాడమీ కార్యాలయంలో అందజేయాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 02-12-2023.
పూర్తి వివరాలకు: 8331041332.
వెబ్‌సైట్: https://www.osmania.ac.in/

ఉస్మానియా యూనివర్సిటీలో డిప్లొమా కోర్సులు

ఉస్మానియా యూనివర్సిటీలోని జర్మన్ విభాగం- 2023-24 విద్యా సంవత్సరానికి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

ఫ్రెంచ్/ జర్మన్‌లో డిప్లొమా కోర్సులు(జూనియర్/ సీనియర్): వ్యవధి నాలుగు నెలలు
అర్హత: జూనియర్ డిప్లొమాకు ఇంటర్మీడియట్, సీనియర్ డిప్లొమాకు జూనియర్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **ఎంపిక:** ప్రవేశ పరీక్ష ఆధారంగా.
దరఖాస్తుకు చివరి తేదీ: 04-12-2023.
వెబ్‌సైట్: https://www.osmania.ac.in/

సీఆర్ఐడీఏలో యంగ్ ప్రొఫెషనల్

వాక్‌ఇన్

హైదరాబాద్ సంతోష్‌నగర్‌లోని సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్- తాత్కాలిక ప్రాతిపదికన పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

యంగ్ ప్రొఫెషనల్–1, 2: 04 పోస్టులు
అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత.
వేతనం: నెలకు వైపీ-1 పోస్టుకు రూ.25,000; వైపీ-2 పోస్టుకు రూ.35,000.
ఇంటర్వ్యూ తేదీ: 07-12-2023.
ప్రదేశం: సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డ్రైల్యాండ్ అగ్రికల్చర్, సంతోష్‌నగర్, హైదరాబాద్.
వెబ్‌సైట్: http://www.icar-crida.res.in/

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో మార్కమోర్ కన్సల్టింగ్

1. సోషల్ మీడియా
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 30, 2023
అర్హతలు: కంటెంట్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/ba89b5

2. బిజినెస్ డెవలప్‌మెంట్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 30, 2023
అర్హతలు: క్లయింట్ రిలేషన్‌షిప్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, లీడ్ జనరేషన్ నైపుణ్యాలు
☛ internshala.com/i/97541b

3. సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 30, 2023
అర్హతలు: కంటెంట్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/ddd674

4. హ్యూమన్ రిసోర్సెస్
సంస్థ: మార్కమోర్ కన్సల్టింగ్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 30, 2023
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/01d51e

ఐటీ ఇన్‌ఫ్రా/ డెవోప్స్

సంస్థ: ల్యాబ్‌చైల్డ్ సొల్యూషన్స్
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: నవంబరు 30, 2023
అర్హతలు: కంప్యూటర్ నెట్‌వర్కింగ్, డెవోప్స్, గిట్‌హబ్, లినక్స్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ నైపుణ్యాలు
☛ internshala.com/i/133820

ఎడ్యుకేషనల్ వీడియో క్రియేషన్

సంస్థ: ఎస్ఆర్ ఎడ్యు టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.15,000-20,000
దరఖాస్తు గడువు: నవంబరు 27, 2023
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటంలో నైపుణ్యం
☛ internshala.com/i/ca0dbd

మీడియా అండ్ పీఆర్

సంస్థ: కనెక్షన్స్ ఐమేగ్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: నవంబరు 27, 2023
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/28c6bd

గుంటూరు, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలలో రిక్రూట్‌మెంట్

సంస్థ: సింప్లిఫై సొల్యూషన్స్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 29, 2023
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్ నైపుణ్యాలు
☛ internshala.com/i/9150ff

నాయకత్వ లక్షణాలు పెంచుకోండి ఇలా!

నాయకులకు ఉండాల్సిన లక్షణాల గురించి తెలుసుకున్నాం కదా. ఇప్పుడు ఆ దిశగా ఎదగాలంటే ఎలా ప్రయత్నించాలో చూద్దామా...

నాయకత్వం అనేది ప్రత్యేక నైపుణ్యం. విద్యార్థి దశ నుంచే దీన్ని పెంపొందించుకుంటే కళాశాల స్థాయిలోనే విజయాలకు పునాది ఏర్పడుతుంది. స్వతంత్ర ఆలోచనలు వికసించి చక్కని వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. ఫలితంగా అద్భుతమైన కెరియర్‌కు చక్కని బాట వేసుకోవటానికి వీలవుతుంది!

విద్యార్థి నాయకత్వం అంటే.. ప్రధానంగా కళాశాలకు సంబంధించిన వివిధ కార్యక్రమాల్లో చొరవ చూపించటం, క్రియాత్మకమైన పాత్ర పోషించటం. ఈ ప్రక్రియలో సానుకూలమైన నైపుణ్యాలు క్రమంగా వృద్ధి చెందుతాయి. అందరితో సత్సంబంధాలు పెరుగుతాయి. ఆత్మవిశ్వాసంతో తమతో పాటు సహ విద్యార్థులు విద్యా, విద్యేతర కార్యక్రమాల్లో దూసుకువెళ్లేందుకు ప్రేరణను ఇవ్వగలుగుతారు.

కష్టసుఖాలనూ, లాభనష్టాలనూ తట్టుకుని నిలబడగలిగే శక్తి నాయకుడికి పుష్కలంగా ఉంటుంది. నిర్ణయాలు తీసుకునే నైపుణ్యమూ ఎక్కువే. ఒకవేళ తాను తీసుకున్న నిర్ణయం వల్ల నష్టం జరిగినా.. దానికి పూర్తి బాధ్యత తనదేనని నిజాయతీగా ఒప్పుకుంటాడు. ఇంకా ఏయే లక్షణాలు ఉంటాయో తెలుసుకుందామా...

భావవ్యక్తీకరణ

విజయవంతమైన నాయకుడు ఎప్పుడూ తన ఆలోచనలూ, అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేస్తాడు. కాబట్టి బృంద సభ్యులు కూడా ప్రాజెక్టు లక్ష్యాలూ, అంచనాలకు తగినట్టుగా పనిచేస్తారు. ఇతరుల అభిప్రాయాలను జాగ్రత్తగా వింటాడు. మాట్లాడినా, రాసినా ఎలాంటి అనుమానాలూ, అపోహలకూ తావులేకుండా చూసుకుంటాడు. నిజానికి మిగతా నైపుణ్యాలకు ఇది పునాది లాంటిది. ప్రతిభావంతులైన నాయకుడు బృందంలో స్ఫూర్తిని నింపుతాడు. తన ఆలోచనలను సభ్యులకు తెలియజేస్తూ.. వాళ్లందరూ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ అభివృద్ధికి తోడ్పడేలా చేస్తాడు.

నేర్చుకుంటూనే ఉంటారు

ఎంత ఉన్నత స్థాయికి వెళ్లినా కొత్తగా ఎప్పుడూ ఏదైనా నేర్చుకుంటూనే ఉంటాడు. ఈ క్రమంలో డిప్లొమా, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులు చదువుతూనే ఉంటాడు. అలాగే గెలుపు, ఓటములు ఏవి ఎదురైనా ఆ అనుభవాలను గుర్తుపెట్టుకుంటాడు. వాటి నుంచి పొందిన పరిజ్ఞానం, నైపుణ్యాలను అందిపుచ్చుకుంటాడు.

స్వీయ అవగాహన

తన సామర్థ్యాలపై స్పష్టమైన అవగాహన ఉంటుంది. అనుభవ పాఠాలను వృత్తి, వ్యక్తిగత జీవితాల్లో అన్వయిస్తాడు. ఈ విధమైన అవగాహన లక్ష్య సాధనకూ, నాయకత్వ నైపుణ్య దిశగా ఎదుగుదలకూ తోడ్పడుతుంది.

బలాలు, బలహీనతలు

మీ బలాలు, బలహీనతలను ముందుగా అర్థంచేసుకోవాలి. దాంతో ఏయే అంశాల్లో వెనకబడి ఉన్నారో, వేటిని మెరుగుపరుచుకోవాలో తెలుస్తుంది. ఆన్‌లైన్‌లో లీడర్‌షిప్ క్వాలిటీస్‌కు సంబంధించిన క్విజ్‌లూ అందుబాటులో ఉన్నాయి. వీటిలో పాల్గొనడం ద్వారా మీరే స్థాయిలో ఉన్నారో తెలుసుకోవచ్చు. కొన్ని విద్యాసంస్థలు నాయకత్వ లక్షణాలను మెరుగుపరుచుకునే అవకాశాన్నీ కల్పిస్తున్నాయి.

మార్గదర్శి ఉంటే

ప్రపంచవ్యాప్తంగా పేరొందిన క్రీడాకారుల లక్ష్యసాధనకు మార్గదర్శులు ఎంతో కృషిచేశారు. నాయకత్వ నైపుణ్యం, ప్రణాళికలు, లక్ష్యాలను కోచ్‌లు విశ్లేషిస్తారు. సాధారణంగా సీనియర్లు, రిటైర్డ్ వ్యక్తులకు పరిశ్రమపైన అవగాహన ఉండటంతో.. అనుభవంతో సలహాలు ఇవ్వగలగుతారు. కొన్ని సంస్థలు నాయకత్వ లక్షణాల మెరుగుదలకు కోచింగ్ ప్రోగామ్‌లూ నిర్వహిస్తాయి. అవసరమైతే మెంటర్‌ను స్వయంగా కలిసీ సలహాలు తీసుకోవచ్చు.

అర్థం చేసుకోవాలి

ఏ నాయకత్వ విధానాన్ని అనుసరిస్తున్నారనే విషయంలో స్పష్టమైన అవగాహన ఉండాలి. బృందాన్ని ఆదేశించే విధానాన్నే మీరు ఎక్కువగా అనుసరిస్తున్నారు అనుకుందాం. అలాంటప్పుడు ఎక్కువగా చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలి. డెలిగేటివ్ శైలిని అనుసరిస్తూ బృందానికి ఎక్కువగా స్వేచ్ఛను ఇస్తే.. బృంద సభ్యులూ నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకుంటారు.

అధ్యయనం, పరిశోధన

కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఉత్సాహం నాయకుడికి ఎప్పుడూ ఉండాలి. పారిశ్రామిక పరిశోధనలనూ, కొత్త పోకడలనూ గమనిస్తుండాలి. పుస్తకాలు చదవడం, సెమినార్లూ, ఆన్‌లైన్ క్లాసులకు హాజరుకావాలి. దీంతో పరిచయాలు పెరిగి, కొత్త అవకాశాలనూ అందిపుచ్చుకోవచ్చు.

లక్ష్య సాధన

మీ బలాలు, బలహీనతలను గుర్తించాలి. ఏదైనా ఒక నైపుణ్యం మీద ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించాలి. అడాప్టబిలిటీ, కమ్యూనికేషన్, కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్, క్రియేటివిటీ, క్రిటికల్ థింకింగ్, డెసిషన్ మేకింగ్, మోటివేషన్-ఇన్‌స్పుయెన్స్ నెగోషియేషన్, రిలేషన్‌షిప్ బిల్డింగ్.. ఇవన్నీ నాయకత్వ లక్షణాల కిందికే వస్తాయి. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు ప్రణాళిక తయారుచేసుకోవాలి. అభివృద్ధిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి.

అవకాశాలను వినియోగించుకోవాలి

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను మెరుగుపరుచుకోవడానికి ప్రయత్నించాలి. ఈ క్రమంలో వచ్చే ఏ అవకాశాన్నీ వదులుకోకూడదు. అలాగే ఉద్యోగం వచ్చిన తర్వాత అలవాటైన పనులు చేయడానికే పరిమితం కాకూడదు. సౌకర్యవంతమైన పరిధి నుంచి బయటకు వచ్చి కొత్త విషయాలను నేర్చుకోవడానికి, కొత్త విభాగంలో పనిచేయడానికి ప్రయత్నించాలి. కొత్తగా తీసుకున్న పనిని చిన్నగా మొదలుపెట్టి ఏ పద్ధతులను ఉపయోగిస్తే అది త్వరగా పూర్తవుతుందో గమనించాలి. అవసరమైన మార్పులూ, చేర్పులూ చేసుకోవాలి.

నెట్‌వర్క్ పెంచుకోవడం

నాయకత్వ లక్షణాల అభివృద్ధికి.. పరిశీలించడం చాలా అవసరం. ప్రముఖ నాయకుల వ్యవహారశైలి ఎలా ఉంది, వాళ్లు సవాళ్లను ఎలా ఎదుర్కొంటున్నారు, సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారు, నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారు, ఎలాంటి వ్యూహాలను అనుసరిస్తూ బృంద విజయానికి కృషి చేస్తున్నారో తెలుసుకోవచ్చు. పారిశ్రామిక ప్రదర్శనలకు హాజరుకావడం, సోషల్ మీడియా సైట్ల ద్వారా ఇతర నాయకులతో పరిచయాలూ పెంచుకోవచ్చు.

పరిస్థితులకు అనుగుణంగా

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే నేర్పు నాయకుడికి ఉండాలి. ఇలాగే ఉండాలి, ఇలాగే ప్రవర్తించాలి అనే నియమాలు పెట్టుకోకుండా.. ఇతరుల నుంచీ నేర్చుకోవచ్చు. బృంద సభ్యులు, సహోద్యోగుల ఆలోచనలు, అభిప్రాయాలు, సూచనలు, సలహాలూ తీసుకోవచ్చు. నాయకత్వంలో పారదర్శకత ముఖ్యం. ఇతరుల అభిప్రాయాలకూ విలువనివ్వడం వల్ల మేటి నిర్ణయాలు తీసుకునే అవకాశం దక్కుతుంది.